క్లుప్తంగా

'జగనన్నే మా భవిష్యత్' అంటున్న ప్రజలు



పెదకాకాని: మండలంలోని ఉప్పలపాడు, పెద కాకాని, తక్కెళ్ళ పాడు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మంగళవారం జరిగింది. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న సేవలను సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వివరించారు. ఇంటి యజమానుల అనుమతితో స్టిక్కర్లను అంటించారు. స్థానిక నాయకులు గజ్జల మల్లయ్య, సుబ్బాయమ్మ, దూపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకరస్వామి జయంతి వేడుకలు



పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు పట్టణంలోని బ్రాహ్మణ బజారులోని శంకర మఠంలో మంగళవారం శంకరస్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శంకర స్వామికి అభిషేకాలు, కుంకమార్చనలు, రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. బ్రాహ్మణ మహా సభ అధ్యక్షుడు పీవీఎస్ఎస్‌వీ ప్రసాద్ పర్యవేక్షణలో జానపాటి శివప్రసాద్ శాస్త్రి, చావలి పవన్‌కుమార్, మారుతీ శాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేక వాహనంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్మశాన స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ



పెదనందిపాడు: శ్మశాన స్థలంలో బిల్డింగ్ నిర్మిస్తున్నారని 'స్పందన'లో అందిన అర్జీ మేరకు.. సదరు స్థలాన్ని గుంటూరు ఆర్డీఓ ఎం.ప్రభాకరరెడ్డి పరిశీలించారు. మంగళవారం పెదనందిపాడు వచ్చిన ఆయన..విచారణ చేపట్టారు. తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం శ్మశాన స్థలం రికార్డులను, స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ .. స్థలం గ్రామ కంఠం సబ్ డివిజన్ పరిధిలో ఉందని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో ప్రైవేటు భవనాలు నిర్మించకూడదని, నిర్మిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆర్డీఓ వెంట డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వే సత్యనారాయణ రెడ్డి, డిప్యూటి తహసీల్దారు హుస్సేన్, మండల సర్వేయర్ ప్రసాదు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో మంగళవారం నిరసన తెలిపారు. పాఠశాల పర్యవేక్షణ సమయంలో ఉపాధ్యాయులను కించపరుస్తూ, సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు నల్ల రిబ్బన్లు ధరించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నతాధికారుల తీరుతో ఉపాధ్యాయులు మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇలాంటి చర్యలను ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కల్యాణి జయలూక్, ఉపాధ్యాయులు నాగ మల్లేశ్వరరావు, శివయ్య, వీరయ్య, ఎలిజెబెత్ రాణి, శివకుమారి, సామ్రాజ్యం, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు హెచ్‌ఎంలకు సోషల్ ఆడిట్‌పై శిక్షణ

ప్రత్తిపాడు: స్థానిక మండల విద్యా వనరుల కార్యాలయంలో బుధవారం ప్రధానోపాధ్యాయులకు సోషల్ ఆడిట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ సీహెచ్ రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల రికార్డుల నిర్వహణ, జమాఖర్చులు, బిల్లులు తదితర అంశాలపై రీసోర్స్ పర్సన్‌లు హెచ్‌ఎంలకు శిక్షణ ఇవ్వనున్నారని ఎంఈఓ చెప్పారు. ప్రధానోపాధ్యాయులంతా తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

గుంటూరు రూరల్: జేసీఎస్ మండల కన్వీనర్ దారం అశోక్ కుమార్ యాదవ్ మంగళవారం మొగిలిపువ్వు వెంకటేశ్వరరావు 32వ జయంతి సందర్భంగా బొంతపాడు గ్రామంలోని వృద్ధాశ్రమంలో ఎంవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జనమంతా జగనన్న వెంటే

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



బ్రోచర్ చూపుతున్న ఎమ్మెల్యే సుచరిత, బొప్పన భవకుమార్, కో-ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి

గుంటూరు రూరల్: రాష్ట్రంలోని ప్రతి కుటుంబం జగనన్న వెంటే ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు బొప్పన భవకుమార్, ఐదు జిల్లాల గృహ సారథుల కో-ఆర్డినేటర్ కందుల రవీంద్రారెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతంగా జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. కోటి మంది లబ్ధిదారులను రాష్ట్ర వ్యాప్తంగా గృహ సారథులు కలవటం జరిగిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఇప్పటికే 79 లక్షల మిస్‌డ్‌కాల్స్ వచ్చాయని తెలిపారు. 79 లక్షల కుటుంబాలు జగనన్నకు మద్దతు తెలిపాయని వివరించారు.ఈ మేరకు మిస్డ్‌కాల్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో దాదాపు 80 శాతం గృహ సారథులు ప్రజల ఇళ్లకు తిరిగారని, జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు సంతృప్తికర స్థాయిలో తమకు అందుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేసినట్లు చెప్పారు. ప్రజా స్పందనను చూసి ఓర్వలేని చంద్రబాబు, ఆయన దత్త పుత్రుడు జగనన్నపై, రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను ఇటీవల కలిసినప్పుడు గుంటూరు చానల్ వర్క్ విషయంలో రైతులకు నష్ట పరిహారం వచ్చే నెల నుంచి అందిస్తానని చెప్పటం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రత్తిపాడు ప్రధాన రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్‌కు త్వరలో అనుమతులు రానున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణానికి జగనన్నను అడిగిన వెంటనే రూ.3 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో నియోజక వర్గంలోని ఐదు మండలాల జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధితోనే అన్ని రంగాల పురోగతి



విద్యార్థులతో వీసీ అచార్య విష్ణువర్ధన్ రెడ్డి, రిజిస్ట్రార్, డీన్ లు

ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి

గుంటూరు రూరల్: రైతులు అభివృద్ధి చెందితేనే రాష్ట్రంలోని అన్ని రంగాలు అభివృద్ధి బాటలో నడుస్తాయని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందన్న సమావేశ మందిరంలో వ్యవసాయ విద్య పూర్తి చేసుకుని, గ్రామీణ పని అనుభవ పథకంలో భాగంగా జరిగిన ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులతో ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో వీసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వీసీ మాట్లాడుతూ వ్యవసాయ విద్యలో క్షేత్రస్థాయి అనుభవం ఎంతో ముఖ్యమన్నారు. ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బాపట్లకు చెందిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఐదు గ్రామాల్లో, అనుబంధ కళాశాల కదిరి బాబురావు కళాశాల విద్యార్థులు నాలుగు గ్రామాల్లో క్షేత్రస్థాయి శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ రంగంలోని అనుభవాలను విద్యార్థులు పల్లవి, స్వాతి, ప్రత్యూష, వినూత్న, రెడ్డమ్మ, జాస్మిన్, ఆయేషా వీసీకి వివరించారు. రైతు స్థాయిలో మార్కెటింగ్ అనేది ప్రధాన సమస్యగా గుర్తించటం జరిగిందని చెప్పారు. రసాయనిక ఎరువుల వినియోగం అవసరానికి మించి ఉందని తెలిపారు. సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు మాట్లాడుతూ ఐసీఏఆర్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లను 30 శాతం పెంచిందని తెలిపారు. అగ్రికల్చర్ డీన్ డాక్టర్ పి.సుధాకర్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు మంచి ఇనిస్టిట్యూట్‌లో పారిశ్రామిక శిక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ కిషోర్‌బాబు, ప్రోగ్రాం ఆర్గనైజర్ డాక్టర్ సీహెచ్ శ్రీలతవాణి, జి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల



రావిపాడు గ్రామంలో శిడిమాను ఊరేగింపు

పెదనందిపాడు: జగజ్జననీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం మంగళవారం గ్రామంలో వైభవంగా జరిగింది. అమ్మలగన్న అమ్మ పోలేరమ్మను భక్తులు దర్శించుకున్నారు. సంప్రదాయ బద్ధంగా అమ్మవారిని గ్రామస్తులు పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, పొంగళ్లు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. మొక్కులు తీర్చుకున్నారు. విద్యుత్ దీపాల వెలుగులో ఆలయం వెలిగిపోయింది. విద్యుత్ ప్రభలను గ్రామం వెలుపల ఏర్పాటు చేశారు. సాయంత్రం శిడిమాను ఉత్సవం ఘనంగా జరిగింది. ఊరేగింపు సందర్భంగా భక్తులు తమ మొక్కులు తీరాలని శిడిమానుకు రకారకాల పండ్లను విసిరారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పెదనందిపాడు పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం



కొళాయి లేక వృథాగా పోతున్న తాగునీరు

పెదకాకాని: తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. తక్కెళ్లపాడు గ్రామంలో బొడ్డురాయి సెంటర్ వద్ద, గాంధీ నగర్‌లో ప్రజలకు తాగునీటి అవసరాల కోసం పంపులు ఏర్పాటు చేశారు. ఏడాదిగా ట్యాప్‌లు అమర్చే వారు లేక నీరు వృథాగా పోతోంది. తక్కెళ్ళపాడు గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా అవుతున్న నీరు వాడుకునేందుకు మాత్రమే ఉపయోగపడుతోంది. సంగం జాగర్లమూడి నుంచి గుంటూరు నగరానికి ఫిల్టర్ అయిన నీరు సరఫరా అవుతుంది. దీంతో ఉన్నతాధికారులు గ్రామ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు గాంధీ నగర్‌లోనూ, బొడ్డురాయి సెంటర్‌లోనూ గుంటూరు నగరానికి తాగునీరు సరఫరా అవుతున్న పైప్‌లైన్ నుంచి రెండు చోట్ల కనెక్షన్లు ఏర్పాటు చేశారు. ఆ రెండు చోట్ల పంపుల ద్వారా తాగునీరు 24 గంటలు సరఫరా అవుతూనే ఉంటుంది. సంగం జాగర్లమూడిలో ఫిల్టర్ అయిన నీరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తక్కెళ్ళపాడు వద్ద మురుగు కాలువలోకి చేరుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంపులకు కుళాయిలు ఏర్పాటు చేయాలని, తాగునీరు వృథా కాకుండా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

శ్రీ చైతన్యలో విద్యార్థి అనుమానాస్పద మృతి



హరిచరణ్ మృతదేహం

గుంటూరు ఈస్ట్: గుంటూరు నవభారత్ నగర్ 4వ లైనులోని శ్రీ చైతన్య బాయ్స్ హాస్టల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి ఐదోఅంతస్తు నుంచి కిందపడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సేకరించిన సమాచారం మేరకు ఏటుకూరు గ్రామం గాయత్రినగర్‌కు చెందిన మల్లేష్ నాయుడు మంగళగిరి ఎస్ఈబీలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. అతని పెద్దకుమారుడు తమ్మినేని హరిచరణ్ (15) గుంటూరు నవభారత్‌నగర్ 4వ లైనులోని శ్రీచైతన్య బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం హరిచరణ్ అస్వస్థతకు గురికావడంతో హాస్టల్ సిబ్బంది అతనిని నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించి, అనంతరం హాస్టల్‌కు తీసుకొచ్చారు. మంగళవారం తెల్లవారుజామున హరిచరణ్ హాస్టల్ ఐదో అంతస్తు నుంచి కిందపడ్డాడు. హాస్టల్ సిబ్బంది అతనిని నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. హరిచరణ్ తండ్రి మల్లేష్ నాయుడు, తల్లి స్వాతి, కుటుంబ సభ్యులు తమ కుమారుడి మృతి చెందడాన్ని తట్టుకోలేక తీవ్రంగా రోదించారు. ఈ మేరకు విద్యార్థి తల్లిదండ్రులు పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హాస్టల్ ఐదో అంతస్తులో ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్ గతంలోనే తొలగించి ఉంది. హాస్టల్ సిబ్బంది దానిని మరమ్మతులు చేసి బిగించి విద్యార్థుల పట్ల సరైన పర్యవేక్షణ ఉంటే ఈ ఘటన జరిగేది కాదని బాలుడి తల్లిదండ్రులు ఆరోపించారు.

దూషణపై కేసు నమోదు..

గుంటూరు ఈస్ట్: కులంపేరుతో దూషించి బెదిరించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం స్వర్ణాంధ్రనగర్‌కు చెందిన యండ్రపాటి కిరణ్ 2018లో డి.మనోజ్‌కుమార్‌కు రూ. 5 లక్షలు అప్పు ఇచ్చాడు. మనోజ్‌కుమార్ ప్రామిసరీ నోట్, చెక్కును కిరణ్‌కు అందజేశాడు. మార్చి 19న పట్టాభిపురంలో ఇరువురు ఎదురుపడ్డారు. మనోజ్‌కుమార్‌ను కిరణ్ డబ్బులు చెల్లించాలని అడిగాడు. మనోజ్‌కుమార్ కులం పేరుతో కిరణ్‌ను దూషించి చంపుతా నని బెదిరించాడు. కిరణ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యకు కారణమైన నిందితుల అరెస్ట్

కొత్తమల్లాయపాలెం (ప్రత్తిపాడు): వివాహిత ఆత్మహత్యకు కారకులైన నలుగురు నిందితులను ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. ప్రత్తిపాడు మండలం కొత్త మల్లాయపాలెం గ్రామానికి చెందిన వణుకూరి సామ్రాజ్యానికి రామకృష్ణారెడ్డితో వివాహం అయ్యింది. ఈ క్రమంలో తనను మామ ఫణిరెడ్డి, ఆయన చెల్లి రాముడమ్మ, బావ శ్రీనివాస్‌రెడ్డి, అత్త శివరంజని వేధిస్తుండటంతో సామ్రాజ్యం గత నెల 11న పెట్రోల్ పోసుకుని నిప్పంటిచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 19న చనిపోయింది. దీంతో ఆమెను వేధింపులకు గురిచేసిన వారిని అరెస్టు చేయాలంటూ.. సామ్రాజ్యం మృతదేహంతో కుటుంబ సభ్యులు 20న ప్రత్తిపాడు మెయిన్ రోడ్‌లో రాస్తారోకో చేశారు. డీఎస్పీ ప్రశాంతి నిందితులను వెంటనే అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ నేపథ్యంలో నిందితులు పరారీ అయ్యారు. సీఐ ఎంవీ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు, నల్లపాడు ఎస్ఐ డి.అశోక్‌లు రెండు బృందాలుగా ఏర్పడి వారి ఆచూకి కోసం గాలించారు. ఐదుగురిలో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శివరంజని పరారీలో ఉన్నారని, ఆమెను కూడా త్వరలోనే పట్టుకుని అరెస్టు చేస్తామని ఎస్ఐ విలేకరులకు తెలిపారు.

మిర్చి బస్తాల చోరీపై కేసు నమోదు

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): మిర్చి బస్తాల చోరీపై వట్టిచెరుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వి.కలగయ్య వివరాల మేరకు.. చింతపల్లిపాడు గ్రామానికి చెందిన మన్నవ కిషోర్ తన పొలంలో పండిన మిర్చిని కల్లాల్లో ఎండబెట్టి బస్తాల్లో నింపాడు. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని ఇద్దరు మిర్చి కల్లంలోకి వెళ్లి దొంగతనంగా చెరొక బస్తాను తీసుకెళ్తున్న క్రమంలో గమనించిన స్థానికులు పెద్దగా కేకలు వెయ్యడంతో ఇద్దరిలో ఒకరు మిర్చి బస్తాను అక్కడే వదిలేసి పారిపోయాడు. మరొక వ్యక్తి మిర్చి బస్తాతో పరారయ్యాడు. ఈ మేరకు కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మామిడి పండ్ల దుకాణాల్లో అధికారుల తనిఖీ

గుంటూరు మెడికల్: స్థానిక లాలాపేటలోని మామిడి పండ్ల కాపు దుకాణాల్లో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ షేక్ గౌస్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు జరిగాయి. ఎక్కువ శాతం మంది మామిడి పండ్ల వ్యాపారస్తులు మామిడి పండ్ల పరిపక్వతకు క్యాల్షియం కార్బైట్‌ను వాడకపోవడం గమనించి వారిని అభినందించారు. కొంత మంది వ్యాపారస్తులు ఎతోఫాన్ రసాయనాన్ని నేరుగా పండ్లపై స్ప్రే చేయడాన్ని గమనించి నిబంధనలకు విరుద్ధంగా నేరుగా స్ప్రే చేయకూడదని హెచ్చరించారు. ఎతోఫాన్ ప్యాకెట్లను తడిచేసి పండ్లకు తగలకుండా మామిడి పండ్ల ట్రేల్లో ఒక మూలన ఉంచి రవాణా చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.
వేసవిలో అమితంగా మామిడిని ఇష్టపడే వినియోగదారులంతా మామిడి పండ్లను రెండు నిమిషాలు నీటి ధార కింద ఉంచి శుభ్రంగా కడగాలని గౌస్ మొహిద్దీన్ తెలిపారు. ఉప్పు ద్రావణంలో ఐదు నిమిషాలు ముంచి కడిగి తినడం చాలా ఉత్తమమని పేర్కొన్నారు. పండ్లపై ఉండే కీటక నాసిని అవశేషాలను పూర్తిగా తొలగించేందుకు మామిడి పండ్లపై తొక్కను పూర్తిగా తీసి తినడం ఆరోగ్యమని వెల్లడించారు. వ్యాపారస్తులందరూ వార్షిక టర్నోవర్‌ను ఫామ్–డీ1లో పొందుపరిచి మే 31వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా పంపాలన్నారు. ఆలస్యమైతే రోజుకు రూ. 100లు చొప్పున జరిమానా ఉంటుందన్నారు. ఆహార తయారీ, రీప్యాకింగ్, రీలే బుల్స్ వ్యాపారులు తమ ఉత్పత్తులను ఎన్ఏబీఎల్ అక్రిడేషన్ ల్యాబ్‌లో పరీక్ష చేయించి ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. ఆహార వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరూ నిబంధనలు లోబడి లైసెన్సులు, రిజిస్ట్రేషన్‌లు పొందాలన్నారు.
నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేసేవారికి భారీ జరిమానాలు విధించే అవకాశం ఉందన్నారు. లైసెన్సు లేకుండా వ్యాపారం చేస్తే ఆరు నెలలు కఠిన కారాగార శిక్ష, రూ. ఐదు లక్షల వరకు జరిమానా ఉంటుందని హెచ్చరించారు. తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారి రవీంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

వాహనం దగ్ధం



దగ్ధమవుతున్న వాహనం

గుంటూరు ఈస్ట్: అమెజాన్ గూడ్స్ క్యారీయర్ వాహనం దగ్ధమైన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రఘురామ్‌నగర్‌కు చెందిన కె.శ్రీక్రాంత్ టాటాఏసీ వాహనంలో అమెజాన్ గూడ్స్‌ను తీసుకెళుతున్న క్రమంలో మంగళవారం పోలీసుపరేడ్‌గ్రౌండ్ వద్దకు చేరుకోగానే వాహనం ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. వాహనంలోని గూడ్స్ మొత్తాన్ని కింద పడేశారు. వాహనం పూర్తిగా దగ్ధమైంది. రూ. 80 వేలు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు అందుబాటులో ఉండండి



ఎమ్మెల్యే సుచరితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చైర్మన్, డైరెక్టర్లు

కాకుమాను: రేటూరు సొసైటీ చైర్మన్‌గా రేటూరు గ్రామానికి చెందిన వల్లూరి పండుని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వల్లూరి పండు, డైరెక్టర్లు మంగళవారం మాజీ మంత్రి, ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరితను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ ప్రతి రోజు రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సొసైటీ పరిధిలోని రైతులకు కావాల్సిన ఎరువులను సకాలంలో అందించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లూరి సుధాకర్, మాజీ ఎంపీటీసీ వల్లూరి చిట్టిబాబు, అప్పాపురం రైతులు పాల్గొన్నారు.

భూమిని ఆరోగ్యంగా ఉంచుకోవాలి

'విజ్ఞాన్'లో ఘనంగా ప్రారంభమైన రైతుల శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న డెయిరీ సీడ్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ

చేబ్రోలు: రైతులందరూ పంటలు పండే భూములను ఆరోగ్యంగా ఉంచుకోవాలని సంగం డెయిరీ సీడ్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ వ్యాల్యూ అడిషన్ ఆఫ్ ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్ అనే అంశంపై ఐదు రోజుల పాటు రైతులకు నిర్వహించనున్న ట్రెనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ మాట్లాడుతూ.. రైతులు అధిక దిగుబడిని సాధించాలంటే నేలలో సేంద్రియ కర్బన పదార్థం ఎక్కువగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అప్పుడే పండిన పంటలు రుచికరంగా ఉండటంతో పాటు వాటిని ఎక్కువ రోజులు నిలువ చేయవచ్చన్నారు. నాబార్డు డీజీఎం ఎంఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ రైతుల కోసం నిర్వహిస్తున్న ఇక్కడ నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం విజయవంతమైతే ఇక్కడే ఒక ట్రెనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అవకాశాలనేవి రావని, వాటిని వెతుక్కుంటూ వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. నాబార్డ్ జిల్లా డీఎం శరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలి



మాట్లాడుతున్న కందుల శ్రీనివాసరావు

కాకుమాను: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే విడనాడాలని సీపీఎం మండల శాఖ కార్యదర్శి కందుల శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని పేద, మధ్య తరగతి ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఈ నెల 30వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటికీ మోదీ ప్రభుత్వంలో మార్పులేకుంటే తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దొప్పలపూడి రమేష్, కొత్త వెంకటశివరావు, చుక్కా యానాదులు, దేవరకొండ శ్రీను, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సమయం ఇవ్వండి..ఖాళీ చేస్తారు



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నివాసితులు

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు పట్టణంలోని రైలుపేట 9వ వార్డులో రైలు కట్ట ఆనుకొని జీవిస్తున్న 18 కుటుంబాలకు చెందిన పూరి గుడిసెలను తొలగించాలని రైల్వే శాఖ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ మేరకు తహసీల్దారుకు స్థానికులు, వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. తహసీల్దారు కె.శ్రీకాంత్‌కు నివాసితులు తమ సమస్యను వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ జగనన్న కాలనీలో వీరందరికి ఇళ్లు కేటాయించటం జరిగిందని, కానీ, నిర్మాణ పనులు జాప్యం వల్ల పూర్తి కాలేదని మరో ఆరు నెలలు సమయం ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య దృష్టికి కూడా సమస్యను తీసుకువెళ్లినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించి రైల్వే శాఖ వారితో మాట్లాడి న్యాయం చేస్తామని తహసీల్దారు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరక్టర్ దాసరి నారాయణరావు, 9వ వార్డు పార్టీ నాయకులు జాలాది ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.

వీరనాయకునిపాలెంలో మైనింగ్ అధికారుల తనిఖీ



క్వారీ ప్రాంతంలో విచారణ చేస్తున్న మైనింగ్ అధికారులు

వీరనాయకునిపాలెం(చేబ్రోలు): వీరనాయకునిపాలెంలో జరుగుతున్న క్వారీలను మైనింగ్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. కొద్ది రోజులుగా పత్రికల్లో కథనాలు ప్రచురితం కావటంతో పాటు, స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లటంతో మైనింగ్ ఏడీ ఆధ్వర్యంలో అధికారుల ఈ తనిఖీలు చేపట్టారు. ఆదిత్యా ఇన్ ఫ్రా రైల్వే లైన్‌కు గ్రావెల్ తరలించటానికి అనుమతులు తీసుకొని ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల్లో తవ్వకాలు చేస్తున్నట్లు గ్రామానికి చెందిన యర్రాకుల వీరాంజనేయరాజు స్పందనలో ఫిర్యాదు చేశాడు. మైనింగ్ సర్వేయర్, టీఏ, స్థానిక వీఆర్వో మధుబాబు తదితరులు క్వారీ ప్రాంతాలను పరిశీలించారు. వారం రోజుల్లో పూర్తిస్థాయి సర్వే చేసి నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు మైనింగ్ అధికారులు తెలిపారు.